సాక్షి
ప్రకాశం
గురువారం । 6 । మార్చి । 2025

ఇంటర్ పరీక్షలకు 733 మంది గైర్హాజరు



ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. రెండో రోజు 19,047 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 733 మంది గైర్హాజరయ్యారు. 18,314 మంది హాజరయ్యారు. ఇందులో జనరల్ 17,140 మంది విద్యార్థులకు గాను 16,574 మంది విద్యార్థులు హాజరవగా, 566 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు గాను 1907 మందికి గాను 1740 మంది విద్యార్థులు హాజరవగా 167 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 67 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఆరుగురు ఆర్ఐఓలు, 12 మంది డీఈసీలు, 33 మంది స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం
36.7/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

గురువారం ఇఫ్తార్
సాయంత్రం గం 6 : 27

శుక్రవారం సహారి
ఉదయం గం 5 : 05

న్యూస్‌రీల్

వైఎస్సార్ విగ్రహాన్ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్

ఒంగోలు టౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని అవమానపరిచిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్ డిమాండ్ చేశారు. దేశంలో మొట్టమొదటిసారిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుచేసి నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేలా సాయపడిన మహానేత విగ్రహంపై కూర్చోవడం, కాలితో తన్నడం మూర్ఖపు చర్యని అన్నారు. మూర్ఖంగా ప్రవర్తించిన విద్యార్థులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హత్యకేసులో ఐదుగురికి యావజ్జీవ ఖైదు

ఒంగోలు: హత్యకేసులో ఐదుగురు నిందితులకు యావజ్జీవ ఖైదు విధిస్తూ ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జి డి.రాములు బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన షేక్ ఖాశింపీరా(63) తన కుమారుడు షేక్ ఖాశిం సాహెబ్‌తో కలిసి టెంట్ హౌస్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో బేల్దారి పనులకు సంబంధించి ఖాశిం పీరా తమ్ముడు జిలాని, అదే గ్రామానికి చెందిన మజున్నా నయబా మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో మజున్నా నయబాను ఖాశిం పీరా మందలించాడు. అనంతరం 2017 జనవరి 15న ఖాశిం పీరా మరో తమ్మునితో గొడవపడి కొట్టడంతో ఖాశింపీరా, ఆయన కుమారుడు కలిసి మజున్నా నయబాను మందలించారు. దీనిపై కక్ష పెట్టుకున్న మజున్నా నయబా తమ బంధువులైన మజున్నా రసూల్, మజున్నా బాబు, మజున్నా ఖాజా, మజున్నా మస్తాన్ అలియాస్ మస్తాన్ సాహెబ్ అనే వారితో కలిసి అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో టెంట్ హౌస్ మూసివేసి ఇంటికి వెళుతున్న ఖాశింపీరా, ఆయన కుమారుడు మహబూబ్‌బాషాలపై కత్తి, క్రికెట్ బ్యాట్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన ఖాశింపీరా వైద్య చికిత్స పొందుతూ మృతిచెందగా ఆయన కుమారుడు మహబూబ్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి పామూరు ఎస్సై సాంబశివరావు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ఎం.రాజేష్ విచారణ చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువైనట్లు పేర్కొంటూ నిందితులు ఐదుగురికి జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.7500 చొప్పున జరిమానా విధిస్తూ 3వ అదనపు జిల్లా జడ్జి డి.రాములు తీర్పునిచ్చారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచిన సిబ్బందిని, కేసును వాదించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారిని, సీఐ ఎం.రాజేష్, ఎస్సై సాంబశివరావులను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

పురుగుమందు తాగి పోలీస్‌స్టేషన్‌కు..

- వెంటనే ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- చికిత్స పొందుతూ మృతి

రాచర్ల: పురుగుల మందుతాగిన ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సంఘటన మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలకు సోమిదేవిపల్లె గ్రామానికి చెందిన పిక్కిలి చెన్నరాయుడు(58) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వెంటనే స్థానిక రాచర్ల పోలీస్ స్టేషన్ వచ్చాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక పోలీసులు వెంటనే ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని వెంటనే పోలీస్ వాహనంలోనే గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్సై పి.కోటేశ్వరరావు వెంటనే గిద్దలూరు ఏరియా వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పిక్కిలి చెన్నరాయుడుకి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పిక్కిలి చెన్నరాయుడికి రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి భార్య అతడిని వదిలేయడంతో చిన్న కుమారుడి దగ్గర ఉంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన చెన్నరాయుడు పురుగులమందు తాగినట్లు సమాచారం.

పొగాకు రైతును ఊరిస్తున్న ధరలు..!

పొగాకు రైతుకు ఒక వైపు లాభాలు వస్తుంటే అదే రీతిలో సాగు ఖర్చులు కూడా భారీగా పెరుగుతూ వస్తున్నాయి. పొలం, బ్యారన్ కౌలు ధరలు, కూలీ రేట్లు రెట్టింపయ్యాయి. ఈ దఫా ప్రారంభం నుంచి మంచి ధరలు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. నాణ్యమైన పొగాకుకు మంచి ధరే వస్తుంది. అయితే దిగుబడిలో నాణ్యత తగ్గితే రైతుకు కష్టాలు తప్పవని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే కర్నాటక ధరలు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి వేలం కేంద్రాలు ప్రారంభమవుతుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.



- భారీగా పెరిగిన సాగు ఖర్చులు
- గత ఏడాది కంటే ఎక్కువ రేటు వస్తేనే లాభాలు
- సరాసరి రూ.300 ఇవ్వాలని రైతులు డిమాండ్
- ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పొగాకు వేలం

పొగాకు రైతులు	30,000
బ్యారన్‌లు	24,000
సాగుకు బోర్డు అనుమతి ఇచ్చిన విస్తీర్ణం	68,500 హెక్టార్లు
సాగుచేసింది	88 వేల హెక్టార్లు
బోర్డు అనుమతి ఇచ్చిన పంట ఉత్పత్తి పరిమాణం	105.27 మి.కిలోలు
పంట ఉత్పత్తి అంచనా	162 మి.కిలోలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 11 వేలం కేంద్రాలున్నాయి. ఉమ్మడి ప్రకాశంలో 24 వేల బ్యారన్‌ల ద్వారా 30 వేల మంది రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. 2025–26 సీజన్‌కు సంబంధించి 105.27 మిలియన్ కేజీల పొగాకును అధికారికంగా అమ్ముకునేందుకు బోర్డు అనుమతి ఉంది. అయితే ప్రస్తుతం సాగు విస్తీర్ణం, వస్తున్న ఉత్పత్తిని పరిశీలిస్తే 162 మిలియన్ కేజీల వరకు ఈ సీజన్‌లో అమ్మకాలు ఉండొచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

కర్ణాటక మార్కెట్ సరాసరి రూ.268

ప్రస్తుతం కర్ణాటకలో జరుగుతున్న పొగాకు వేలంలో ధరలు ఆశాజనకంగానే ఉన్నాయని అక్కడ రైతులు అంటున్నారు. బ్రైట్ గ్రేడ్ కేజీ పొగాకు ధర రూ.337 వరకు పలుకుతోంది. మొత్తం కేజీ పొగాకు సరాసరి ధర చూస్తే రూ.268.25 వరకు వచ్చింది. అయితే ఆంధ్రాలో పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ధరలు రూ.300లకు పెంచాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

గ్రేడింగ్‌లో జాగ్రత్తలు అవసరం..

ఈ ఏడాది పొగాకు నాణ్యత ఆశాజనకంగా ఉండడం రైతులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. మొత్తం ఉత్పత్తుల్లో 50 శాతానికి పైగా మొదటి రకం అంటే బ్రైట్‌గ్రేడ్ వచ్చాయని బోర్డు అధికారులు చెప్తున్నారు. మిగిలిన గ్రేడ్ కూడా ఆశించిన స్థాయిలో నాణ్యతగా ఉన్నాయని చెప్తున్నారు. ఇది వేలంలో రైతులకు సానుకూలాంశంగా మారనుంది. అయితే గ్రేడింగ్ విధానంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని, గ్రేడ్‌లు వేరు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించి బేళ్లు కట్టాలని సూచిస్తున్నారు.

10 నుంచి వేలం ప్రారంభం:

ఈ నెల 10వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలో పొగాకు వేలం ప్రారంభం కానుంది. కందుకూరు-1వ వేలం కేంద్రంతో పాటు ఒంగోలు-1, కొండపి, పొదిలి వేలం కేంద్రాల్లో వేలం ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. మిగిలిన ఏడు వేలం కేంద్రాల్లో కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లితో పాటు ఒంగోలు-2, టంగుటూరు, వెల్లంపల్లి, కనిగిరి వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

> **వేలం ప్రారంభమయ్యాకే ధరలపై అంచనా**
> ఈనెల 10వ తేదీ నుంచి ఈ సీజన్‌కు సంబంధించి అధికారికంగా పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభించనున్నాం. మొదటి దశలో నాలుగు వేలం కేంద్రాలు, 19వ తేదీ మిగిలిన వేలం కేంద్రాల్లో వేలం ప్రారంభిస్తాం. ఈ ఏడాది ఉత్పత్తి బాగా పెరిగింది. రైతులు ఖర్చులకు అనుగుణంగా ధరలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వేలం ప్రారంభమైన తరువాత ధరలపై ఒక అంచనాకు రాగలం.
> – లక్ష్మణరావు, ఆర్ఎం



భారీగా పెరిగిన సాగు ఖర్చులు..

పొగాకు రైతులు పోటీ పడడంతో పొలాల, బ్యారన్ కౌలు ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతేడాది లక్ష రూపాయలు ఉన్న బ్యారన్ కౌలు ఈ ఏడాది రూ.2.50 లక్షలకు పెరిగింది. ఇలా పొలం కౌలు, కూలీల రేట్లు అన్నీ రెట్టింపయ్యాయి. ఈ పరిస్థితుల్లో గతేడాది కంటే బ్యారన్‌కు రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు అదనంగా ఖర్చు అయిందని స్వయంగా బోర్డు అధికారులే లెక్కలు వేస్తున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా వేలంలో ధరలు కూడా పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేజీ పొగాకు సరాసరి ధరను రూ.300లకు తగ్గకుండా ఇవ్వాలని కోరుతున్నారు. అయితే గతేడాది వేలం ముగిసే సమయానికి కేజీ పొగాకు సరాసరి ధర రూ.254 మాత్రమే ఉంది. అంటే ఈ ఏడాది అదనంగా దాదాపు రూ.50 వరకు సరాసరి ధర పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. కానీ రైతులు ఆశించిన స్థాయిలో ఈ ఏడాది మార్కెట్ ఉంటుందా ఉండదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

పశ్చాత్తాప పడతారు.. ఖబడ్దార్

- చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు సిటీ: ఒంగోలు రెడ్డి హాస్టల్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం జోలికి వచ్చిన వారిని రానున్న రోజుల్లో పశ్చాత్తాప పడేలా చేస్తామంటూ వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఒంగోలు నగరంలోని రెడ్డి హాస్టల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహంపైకి ఎక్కి టీడీపీ జెండాలు కట్టిన వైనంపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీనిని పార్టీ సీరియస్‌గా తీసుకుందని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఉపేక్షించేదిలేదని ఆయన హెచ్చరించారు. పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఈ దుశ్చర్యకు పాల్పడిన వారితో పాటు, పోలీసులపై ప్రైవేటు కేసులు వేస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎవ్వరినీ వదిలేది లేదన్నారు.

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు అప్రజాస్వామికం

- మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: కొండపి మండలం పెద్ద కళ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణకు ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా చెక్‌పవర్ రద్దు చేయటం దారుణమని, అప్రజాస్వామిక చర్య అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన కూటమి ప్రభుత్వం చేపడుతున్న అప్రజాస్వామిక చర్యలను ఎండగట్టారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఒక సర్పంచ్‌కు ముందస్తు నోటీసు ఇవ్వకుండా, అతని సంతకం తీసుకోకుండా ఏ ప్రాతిపదికన చెక్‌పవర్ రద్దు చేస్తారని? దీనికి ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం కక్ష సాధింపు చర్యఅని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క పనిచేయనీకుండా అడ్డుకుంటున్నారని, ప్రస్తుతం గ్రామంలో తాగునీటి సరఫరా టీడీపీ నాయకుల పర్యవేక్షణలోనే జరుగుతుందని, ఆరు నెలలుగా వీధిదీపాలు లేక గ్రామం అంధకారంలో ఉందని, ఇదేనా గ్రామ స్వరాజ్యం అని ఎద్దేవా చేశారు. గతంలో సర్పంచ్ సత్యన్నారాయణ పనిచేసిన రూ.3 లక్షల బిల్లులు డ్రా చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇకనైనా కక్ష సాధింపు చర్యలు మానుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వానికి సూచించారు.

అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడండి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు




కట్టకిందపల్లెలో నిరసన తెలుపుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

పామూరు: అగ్రిగోల్డ్ ఆస్తులను కొల్లగొడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వం కస్టమర్లకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కట్టకిందపల్లెవద్ద అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ తోటలను, ఇటీవల నరికివేతకు గురైన జామాయిల్ పొలాలను బుధవారం క్షేత్రస్థాయిలో స్థానిక సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడి 19.52 లక్షల మంది చేసిన డిపాజిట్‌లను తిరిగి చెల్లించాలని 2015 నుంచి అసోసియేషన్ పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్రంలో మొత్తం 24 వేల ఎకరాలను ప్రభుత్వం ఆటాచ్ చేసిందన్నారు. అధికార పార్టీవారు అగ్రిగోల్డ్ ఆస్తులను కొల్లగొడుతున్నారని, జామాయిల్‌ను యథేచ్ఛగా కొట్టి రూ.కోట్లు దండుకుంటున్నారన్నారు. కనిగిరి నియోజకవర్గంలో అగ్రిగోల్డ్‌కు చెందిన పొలాల్లోని జామాయిల్, ఎర్రచందనం నరికించి రూ.కోట్లు కొల్లగొడుతున్నా కాపాడేవారు లేకపోవడం హేయమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో రూ.20 వేల లోపు డిపాజిట్ ఉన్న సుమారు 10.50 లక్షల మందికి నగదు చెల్లించిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం 45 రోజుల్లో అగ్రిగోల్డ్ ఆస్తులను ఆటాచ్‌చేశారన్నారు. నేడు మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ కస్టమర్లకు న్యాయం చేస్తామని ప్రకటించి ప్రభుత్వం వచ్చి 9 నెలలు పూర్తయినా నేటికీ దానిపై పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ నాడు అగ్రిగోల్డ్ మూతబడిన తరువాత జిల్లాలో 6,500 ఎకరాలు సీజ్‌చేశారని, కట్టకిందపల్లెలో 357 ఎకరాలు పొలాలు ఉన్నాయని వీటిలో జామాయిల్ సాగు ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కస్టమర్లకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ సొమ్ము ఇవ్వాల్సిన పనిలేదని అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మితే అంతకంటే ఎక్కువ మొత్తం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు సయ్యద్ మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి కొండారెడ్డి పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య ముదిరిన వివాదం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:



సత్య పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన వేదిక

ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తొమ్మిదేళ్లుగా స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో జరుపుకుంటున్న పుట్టిన రోజు వేడుకలను ఈ దఫా ఒంగోలు నగరంలో నిర్వహించడం చర్చనీయంగా మారింది. తన సోదరుడు, ఎమ్మెల్యే జనార్దన్‌తో ఏర్పడిన మనస్పర్థల కారణంగా సత్య నగర రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జనార్దన్, సత్యల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. తాజాగా ఫ్లెక్సీల వివాదం రాజుకోవడంతో సత్య తన పుట్టిన రోజు వేడుకలను పట్టుబట్టి ఒంగోలు నగరంలో నిర్వహించుకున్నారు. భాగ్యనగర్‌లో జరుపుకున్న ఈ వేడుకలకు కొండపి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదిక మీద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జనార్దన్ ఫొటో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. త్వరలో ఇక్కడే క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంటున్న ఆయన ఇకనుంచి ఒంగోలు కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు చాలా మందిని ఈ వేడుకలకు ఆహ్వానించినప్పటికీ హాజరుకాలేదు. అసెంబ్లీ జరుగుతుందన్న సాకుతో డుమ్మా కొట్టిన టీడీపీ ఎమ్మెల్యేలు ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పినట్లు తెలుస్తోంది. మొత్తం మీద జిల్లా కేంద్రమైన ఒంగోలులో టీడీపీకి ఇప్పటికే రెండు కార్యాలయాలు ఉన్నాయి. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం ఒకటి భాగ్యనగర్‌లో ఉండగా, గుంటూరు రోడ్డులో జనార్దన్ ఆధ్వర్యంలోని మరో కార్యాలయం ఉంది. తాజాగా సత్య రంగ ప్రవేశంతో మూడో కార్యాలయం సిద్ధమవుతోంది.

వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ కండువా..

- ఒంగోలు రెడ్డి హాస్టల్ ముందు టీడీపీ కార్యకర్తలు, ఓ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల హల్‌చల్



డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి టీడీపీ కండువా వేస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు



రెడ్డి హాస్టల్ వద్ద హల్‌చల్ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు, ఇంజినీరింగ్ విద్యార్థులు

ఒంగోలు వన్‌టౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీ కండువా వేసిన ఘటన ఒంగోలులో బుధవారం సాయంత్రం జరిగింది. ఒంగోలు మామిడి పాలెం వద్ద ఉన్న రెడ్డి హాస్టల్ ముందు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఉంది. ఈ విగ్రహానికి టీడీపీ కార్యకర్తలు, ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సాయంత్రం 4 గంటల సమయంలో టీడీపీ కండువా వేశారు. అనంతరం విగ్రహం సమీపంలోనే టీడీపీ జెండా పెట్టారు. హాస్టల్ ప్రహరీ గేటు పక్కన ఉన్న విద్యుత్ లైట్‌ను ధ్వంసం చేశారు. కొంత సేపు అక్కడే నినాదాలు చేస్తూ హల్‌చల్ చేశారు. దాదాపు 50 మందికి పైగా ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజ్ డ్రస్‌లో ఉన్న విద్యార్థులు, టీడీపీ కార్యకర్తలు రెడ్డి హాస్టల్ వద్ద గుమికూడటంతో లోపల హాస్టల్‌లో ఉన్న కొద్ది మంది విద్యార్థులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. కాసేపు నినాదాలు చేసిన అనంతరం టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వీరంతా ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య జన్మదినం కావడంతో వెంగముక్కలపాలెం నుంచి ఒంగోలులోని దామచర్ల సత్య కార్యాలయానికి ర్యాలీగా వెళుతూ మార్గం మధ్యలో ఇలా ఇష్టారీతిన ప్రవర్తించారు. ఈ ర్యాలీకి ముందస్తు పోలీసు అనుమతి కూడా లేదని సమాచారం. ర్యాలీలో ఒక్క పోలీసు కూడా లేకపోవడంతో మద్యం తాగిన టీడీపీ కార్యకర్తలు, విద్యార్థులు నడిరోడ్డుపై చిందులేశారు. రెడ్డి హాస్టల్‌లో ఉండే విద్యార్థులు కళాశాలలకు వెళ్లడంతో పెద్ద గొడవ తప్పింది. కళాశాల వదిలిన తర్వాత అయితే హాస్టల్‌లో కూడా విద్యార్థులు అధిక సంఖ్యలో ఉండేవారు. అదే సమయంలో టీడీపీ కార్యకర్తలు వచ్చి ఉంటే పెద్ద ఘర్షణ జరిగి ఉండేది. టీడీపీ కార్యకర్తలు ఇలాంటి కవ్వింపు చర్యలను ఆపాలని స్థానికులు కోరుతున్నారు. రెడ్డి హాస్టల్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పసుపు కండువాలు వేయడం, కాలితో తన్నడం, విగ్రహంపై కూర్చోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రెడ్డి హాస్టల్ కార్యవర్గం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.